విద్యార్థులారా!

బుద్ధి బహిర్ముఖమై వున్నంత కాలము ప్రాకృతమైన జ్ఞానమే మనకు లభ్యమవుతుందిగానీ ఆత్మ జ్ఞానము లభించదు. ఆత్మ జ్ఞానము కావలెనన్న మానవుని తలంపులు అంతర్ముఖము గావించుకోవాలి. బాహ్యమైన పరిశోధనలు ప్రక్కకు నెట్టి అంతర్ముఖమైన పరిశోధనలకు మానవుడు ప్రయత్నించినప్పుడు ఆత్మానందము తప్పక లభిస్తుంది. 'బ్రహ్మవిత్ బ్రహ్మైవ భవతి'. బ్రహ్మను తెలుసుకున్న వాడు బ్రహ్మయే కాగలడు.

(1) మన దేహమునకు వాత పిత్త శ్లేష్మాదులని మూడు విధములైన రోగములుంటున్నవి. అదే విధముగనే సూక్ష్మదేహమైన మనస్సుకు కూడను మూడు విధములైన దోషములుంటున్నాయి. మల విక్షేప ఆవరణములని. మలమనగా తానెవరో తాను గుర్తించుటకు తగిన ప్రయత్నము చేయక యీ పాంచ భౌతికమైన దేహము, పంచకోశములతో కూడిన దేహము తానని విశ్వసించటమే మల దోషము.

ఆవరణమనగా తనను ఆవరించినది ఆవరణము. ఈ మానవత్వమును మరుగు చేసేది రాగద్వేషములు. ఇంతే కాక అహంకార మమకారములు యీ నిజస్వరూపమును మరుగు పరుస్తున్నది. ధన కనక వస్తు వాహనాదులు కూడను తన స్వరూపమును మరపించుచూ వున్నవి. ఇవన్నీ మలముతో కూడినవి. అరిషడ్వర్గములన్నీ ఆవరణముతో కూడినవి. ఈ ఆవరణమనగా కప్పబడినదని అర్థము. దేనితో కప్పబడింది. ప్రాకృతమైన భావము చేత మన నిజస్వరూపము కప్పబడింది. సత్వ రజో తమో గుణముల చేత కూడను కప్పబడి వుంది. మనకొక హృదయముంది. మన చెస్ట్ ను మనం చూడాలనుకుంటే మన పైన ధరించిన వస్త్రమును పూర్తి దూరము చేయాలి. అప్పుడే మన చెస్ట్ ను మనం చక్కగా చూడగలము. లోపల బనీను వేసుకున్నాడు. పైన షర్టు వేసుకున్నాడు దానిపైన కోటు వేసుకున్నాడు. కోటు తీసివెయ్యాలి తరువాత షర్టు తీసివెయ్యాలి. తదుపరి బనీను తీసివెయ్యాలి. ఈ పైకోటే తమోగుణము. లోపలి షర్టే రజోగుణము. లోపల బనీనే సాత్వికము. ఈ మూడింటిని వేరు చేసినప్పుడే మన చెస్ట్ ను మనం చూడగలము. Chest chestగానే వుంటున్నదిగానీ దానికి కప్పబడిన వస్తువు చేత chest ని మనం చూడలేక పోతున్నాము. ఈ కప్పబడినదే ఆవరణము. దీనిని మనం దూరం చెయ్యాలి.

విక్షేపమనగా స్థిరత్వము లేని తత్వము. నిరంతరము చలిస్తూ వుంటుంది మనస్సు. ప్రాకృతమైన విషయముల పైననే ఎక్కువ ప్రవేశిస్తూ వుంటుంది. కేవలం యీ లౌకికమైన వాంఛల పైన పిచ్చి. ఉన్న

...ని అనుభవించడు. లేనిదాని కోసం ప్రయత్నం చేయడు. ఈ సమస్త దుఃఖములకు ఇదే మూలకారణము. ఉన్న దానిని అనుభవించటానికి ప్రయత్నించడు. లేని దానిని ఆశిస్తాడు. ఆశించింది చిక్కదు ఉన్నది దక్కదు. ఈ విధమైన విక్షేపము చేతనే మానవుడు మరింత అయోమయస్థితిలో వుండిపోతున్నాడు. మలము అనే దానిని ఒక సత్కర్మల చేతనే దూరము గావించుకోవాలి. అదే కర్మ సిద్ధాంతము. ఇంక విక్షేపమనగా భక్తితో భగవచ్చింతన చేసి భగవద్ధ్యానము చేసి తద్వారా ఈ చంచలత్వముతో కూడిన మనస్సును స్థిరత్వము చేసుకోటం. పవిత్రమైన ఏకత్వమును గుర్తించినప్పుడు ఆవరణము నిర్మూలమై పోతుంది. మల విక్షేప ఆవరణములను మనము దూరము గావించుకొనవలెనన్న కర్మ ఉపాసన జ్ఞానము అత్యవసరము.

(2) ఈ జ్ఞాన కర్మల కంటె అత్యంత ఉత్తమమైనది భక్తి. ఇది సులభమైన మార్గము. భక్తి అనగా ఏమిటి? భగవంతునిపై పరిశుద్ధమైన ప్రేమయే భక్తి. దీనినే అనురక్తి అంటారు. అనురక్తిని మనం పెంచుకున్నప్పుడే మనలో ప్రాపంచికమైన విరక్తి ఆవిర్భవిస్తుంది. దైవముపైన అనురక్తి కలుగుతుంది. ఈ భక్తి వల్ల ముక్తి లభిస్తుంది. మొట్టమొదట అనురక్తిని అభివృద్ధి గావించుకోవాలి. ఇది యోగరీతిగా రావాలి. మనము చేసే కర్మల వల్ల మాత్రమే కాదు. దైవానుగ్రహము కూడా దీనికి తోడు కావాలి.

ఆంధ్రప్రదేశములో కృష్ణానదీ తీరములో కాకరవాడ అనే గ్రామము వుండేది. ఇది మంగళగిరికి చాలా సమీపములో వుండేది. ఈ గ్రామములో వేదనారాయణ దీక్షితులు అనే ప్రాచీన సాంప్రదాయకుడు పరిశుద్ధమైన, వేద పారాయణము చేసే వ్యక్తి వుండేవాడు. అది 1478 సంవత్సరము. ఈ వేదనారాయణ దీక్షితులు భగవంతుని సేవించటము నిరంతరము నిష్ఠతో సాధనలు సలపటము, నిరంతరము భగవంతుని యొక్క అనుగ్రహమునకై తపిస్తూ వచ్చాడు. ఒకనాడు ఈ వేదనారాయణ దీక్షితునకు కలలో కనుపించాడు కృష్ణుడు. 'వేదనారాయణా! నీవు చేసే సాధనలు చాలా పవిత్రమైనవి కానీ ఇవన్నీ పరిపక్వస్థితికి రావాలంటే మరింత ఉపకారకములైన కర్మలాచరించాలన్నాడు. నీ వంశములో ఎప్పుడు నూరు సోమయజ్ఞములు గావింపబడునో అప్పుడే మీ యింటిలో నేను జన్మిస్తాను' అన్నాడు. ఈ ఆనందమును భరించుకొని వేదనారాయణ దీక్షితుడు ఆనాటి నుండియే ఈ సోమయాగములు ప్రారంభించాడు. ఈ సోమయాగములు రెండు మూడు చేస్తూ వచ్చాడు. 31 సోమయాగములు చేశాడు. ఈలోపల అతని కాయము అంత్యమొందినది. అతని కుమారుడు గంగాధర దీక్షితులు తండ్రి ఆజ్ఞను పురస్కరించుకొని తాను కూడను సోమయజ్ఞములు ప్రారంభించాడు. అతను 27 సోమయజ్ఞములు చేశాడు. ఈలోపల అతని శక్తిసామర్థ్యములు కూలిపోయినాయి. ఆ గంగాధర దీక్షితునకు ఒక కుమారుడు వుండేవాడు. అతనే గణపతి భట్టు. వారి తాతలు తండ్రులు ఈ సోమయాగములు చేసుకుంటూ వచ్చారు. ఏనాడు కృష్ణుడు మాయొక్క వంశములో జన్మిస్తాడోనని అనేక విధములైన శ్రద్ధా భక్తులతో నిరంతరము కృష్ణా కృష్ణా అని కృష్ణనామము తప్ప ఏకత్వమునకు మనసు

లాంగేది కాదు. తరువాత తాను యజ్ఞములు ప్రారంభించాడు. తదుపరి యీ గణపతి భట్టు 32 సోమయాగ
ములు చేశాడు. తన తాత 31, తన తండ్రి 27, తాను 32 సోమ యజ్ఞములు యివన్నీ చేరి 90 అయినాయి.
కాచుకున్నాడు ఏనాడు యీ నూరు యాగములు పూర్తి అవుతాయని. ఎప్పుడు కృష్ణుడు మావంశములో జన్మి
స్తాడు అని నిరంతర దీక్ష బూనాడు. ఈ లోపల గణపతి భట్టు మరణించాడు. అతని కుమారుడైన వల్లభ
భట్టు ప్రారంభించాడు. ఇతను ఐదు మాత్రము చేయగలిగాడు పాపం. పరిస్థితులు క్రమక్రమేణా సన్న
గిల్లుతూ వచ్చాయి. పాపం యీ family అంతా యాగములు యజ్ఞములు చేయటంతో ఆస్తిపాస్తులు
క్షీణించి పోయాయి. ఇంక వేరే శక్తి సామర్థ్యములు లేక పోయినాయి. అందువలన ఐదు యాగములు
చేశాడు. నిలిపి వేశాడు. అతని కుమారుడు లక్ష్మణ భట్టు తిరిగి ఐదు యాగములు చేశాడు. ఈ ఐదు
యాగములు చేసి నూరు పూర్తి గావించుకొని తన భార్య యల్లమ్మను తీసుకుని కాశీ బయలుదేరాడు.
కాశీలోపల బీదలకు అన్నదానం గావించాలి. బ్రహ్మణులందరికి సేవలు చేయాలని కాశీ వెళ్లాడు. కాశీకి పోయి
న రెండు సంవత్సరములక్కడే నిలచిపోయాడు పాపం. అప్పుడు యల్లమ్మ గర్భం ధరించింది. ఈ లోపల
మహమ్మదీయులు కాశీపట్నంపై బడి ధ్వంసము గావిస్తారనే వార్త రేగింది. ఈ పరిస్థితిలో యీ కాశీపట్నం
లో ఆడవారితో వుండటం కష్టమని భావించి కాలినడకపైన తిరిగి తన స్వగ్రామము రావటానికి పూనుకున్నా
డు లక్ష్మణ భట్టు. ఈ భయము చేత తాను శ్రమపడి నడచి రావటం చేత మధ్యమార్గము లోపల ఆమె
కు గర్భస్రావమైంది. చూచింది. ఏమిటి అని తన చీరను చించి దానిలో చుట్టి ఒక అశ్వత్థ వృక్షముపై
పెట్టి వచ్చింది. తిరిగి నడవ లేక చాలా బలహీనముగా వుండటము చేత ఒక సత్రములో పడుకున్నారు.
కృష్ణుడు వచ్చాడు స్వప్నంలో. ఎల్లమ్మా! నారాయణ భట్టూ! ఎందుకు యిక్కడ నన్ను వదిలి పెట్టి వచ్చారు.
అని ప్రశ్నించాడు. తక్షణమే నీవు వెళ్ళి నన్ను తీసుకుని రా అన్నాడు. ఈ వార్త వినగానే ఉల్లాసము ఉట్టిప
డింది. తెల్లవారి యిరువురు అశ్వత్థ వృక్షము దగ్గరకు వెళ్లారు. ఆ పిల్లవాడు చేతులు కాళ్లు ఆడించుకుం
టూ కిలకిలా నవ్వుతున్నాడు. ఆ బిడ్డను తీసుకున్నారు. తిరిగి వెనుకకు వచ్చారు. కృష్ణుడు యిచ్చిన వర
ప్రసాదము. నా తండ్రిగారి పేరు పెట్టటం మంచిదిగా వుంటుందని ఆ పిల్లవాని పేరు వల్లభాచార్యుడని
పెట్టాడు. పూర్వము దీక్షితులు అనగా దీక్షతో సాధించిన వారు కనుక దీక్షితులు అనే వారు. యజ్ఞనారా
యణ దీక్షితుడు. గంగాధర దీక్షితుడు అని పేరు పెట్టుకుంటూ వచ్చారు. తదుపరి గణపతి భట్టు
వల్లభ భట్టు అని భట్టులని పెట్టుకుంటూ వచ్చారు. ఆచార్యుడనగా ఆచరించి అందరికి ఆనందాన్ని
అందించే వాడు. ప్రతి ఒక్కటి తాను చేసి యితరులకు చూపే వాడు భగవంతుడు. కనుకనే అతనికి
వల్లభాచార్యుడని పేరు పెట్టారు. వల్లభాచార్యుని తీసుకుని గ్రామానికి వచ్చారు. ఆ పిల్లవాడు అందరికి
ఆకర్షణీయంగా వుంటున్నాడు. పిల్లలు మొదలుకొని ముసలివారి వరకు ఆ పిల్లవానిని చూడాలని ఆశ

పడేవారు. కృష్ణ అనే పదమునకు యీ విధమైన అర్థము లుంటున్నాయి. కర్షతీతి కృష్ణః ఆకర్షించేవాడు కృష్ణుడు. కృషి తితి కృష్ణః హృదయ భూమిని సాగు చేసి పవిత్రమైన మధురమైన ఆనందమును పండించేవాడు. కృషీవలుడనగా సేద్యగాడు. పనికిరాని మొక్కలను పారవేసి ఫలించే వృక్షములను నాటేవాడు. మూడవది కృష్ ఇతి కృష్ణః. కృష్ అనగా ఆనందము. సర్వులకు ఆనందము నిచ్చేవాడు కృష్ణుడు. ఇతను అందరికి ఆకర్షణీయుంగా వుంటున్నాడు.

(3) వల్లభాచార్యుడు పెరిగి పెద్దవాడై భక్తిని ప్రచారం చేయటానికి ప్రారంభించాడు. దేవుడు ఒక్కడే పురుషుడు. ఈ ప్రపంచములో పుట్టిన సర్వజీవులూ స్త్రీలే అందరియందు అబలత్వము వుంది. ఆ భగవంతుడే బలుడు. బలుడు భగవంతుడు. దుర్బలుడు జీవుడు. దుర్బలులు స్త్రీలు కనుకనే అబలలు అన్నారు. ఇక్కడ అందరూ అబలలే. దుఃఖము వస్తే అందరూ ఏడుస్తారు. ఆకలి వేస్తే అందరూ తింటారు. ఆనందము వస్తే ప్రతి ఒక్కరు నవ్వుతారు. స్త్రీ పురుషులకు ఎక్కడుంది భేదము. dress, body. mental plane లో ఇద్దరు సమానులే. కేవలము యీ జగన్నాటకమంపైన వీరు వేషము వేసుకున్నారు. గర్ల్స్ హైస్కూల్ లోపల ఒక పెద్ద నాటకమాడుతూ వచ్చారు. రాజు వేషము girl వేసింది. మంత్రి వేషము girl వేసింది. రాణీ వేషము girl వేసింది. ఇక్కడ వేషము వేసిన రాజు స్త్రీయే. మంత్రి స్త్రీయే. యజమాని స్త్రీయే బంట్రోతు స్త్రీయే. గేటు దగ్గర watch man స్త్రీయే. వేషాలు మాత్రం వేసుకున్నారు. కనుక world is a stage all are actors only God is director. ఈ స్టేజి పైన ఆడేవరకు వుంటుంది డ్రస్సు ఆడ, మగ. ఈ స్టేజి డ్రామా అయిపోతే అందరూ ఒక్కటే. అద్వైత మనగా ఏకమేవ అద్వితీయం. రెండవది లేనే లేదు. ఈ స్త్రీల యందు పురుషులందు వున్నది ఒకే భగవంతుడే అని యదార్థమును బోధిస్తూ వచ్చాడు. వల్లభాచార్యుడు కేవలము అద్వైత భక్తిని మధుర భక్తిని చాటుతూ వచ్చాడు. శంకరాచార్యుడు అద్వైత సిద్ధాంతమును బోధించాడుగాని ఇంత pure గా బోధించలేదు. అక్కడ శాస్త్రీయమైన అద్వైతమును బోధిస్తూ వచ్చాడు. కాని వల్లభాచార్యుడు practical అద్వైతమును బోధిస్తూ వచ్చాడు. తాను ఆచరిస్తూ ఇతరులకు అందిస్తూ వచ్చాడు. ప్రజలారా! మనము భగవంతుని నుంచి వచ్చిన వారమే. అగ్ని నుండి అగ్ని కణములు ఏ విధంగా బయలు దేరినాయో అదే విధముగా భగవంతుని నుండి జీవులు బయలుదేరాయి. ఈ అగ్నిలో ఏ విధమైన burning sensation వుందో దాని అణువులో కూడను ఆ burning శక్తి వుంది. దైవమునందు ఏ విధమైన శక్తులున్నాయో మానవుని యందు కూడ అవి ఆ విధమైన శక్తులున్నాయి. అందరు భగవంతుని నుంచి వచ్చిన వారే. అణువులన్నీ చేరి ఒక ఘనముగా రూపొందుతుంది. అనేక అణువుల యొక్క చేరికయే దైవత్వము. unity in diversity బోధిస్తూ వచ్చాడు. ఈ విధంగా చేయటం చేత ప్రజలలో ఒక విధమైన అభిమానము, ప్రేమ, ఐకమత్యము అభివృద్ధి అవుతూ వచ్చాయి. కాశీకి వెళ్ళాడు. కాశీలో వున్న పండితులవల్ల యీ విధమైన ప్రచారము అభివృద్ధి గావించాలి అని సంకల్పించుకున్నాడు. సామాన్యమైన మానవులు చెప్పితే

మానవులు అంతసులభంగా ప్రయత్నం చెయ్యలేరు. పండితుల ద్వారా ప్రచారము చెయ్యాలని కాశీలో ప్రవేశించాడు. కాశీకి పోయి పండితుల సమావేశములో దిగ్విజయముగ వారికి బోధిస్తూ వచ్చాడు. ఈ విధంగా బోధించే సమయములోపల, ఆనాటి చక్రవర్తి అక్బరు, అక్బరు చక్రవర్తి వల్లభాచార్యుని ప్రబోధలు వింటూ వచ్చాడు. ఒకనాడు అక్బరు, బీర్బల్ యిరువురు చేరి వల్లభాచార్యుని దర్శించటానికి వచ్చారు. అక్బరు మహమ్మదీయుడైనప్పటికి దైవభక్తి గలవాడు. కన్నులు మూసుకుని పరధ్యానములో వుండినట్లు నటించాడు వల్లభాచార్యుడు. అక్బరు చక్రవర్తి నిశ్శబ్దంగా నిల్చున్నారు. కొంతసేపైన తరువాత వల్లభాచార్యుడు కన్నులు తెరచి చూచాడు. ప్రభువులు రావటానికి కారణమేమిటని ప్రశ్నించాడు. 'మిమ్మల్ని ఒక ప్రశ్న అడగటానికి వచ్చానన్నాడు' అక్బరు. అప్పుడు అడగవల్సినదని అనుమతి యిచ్చాడు. 'భగవంతుని దర్శించటం ఎట్లా? భగవంతుడు యేవిధంగా దర్శనం యిస్తాడు?' అని అడిగాడు అక్బరు చక్రవర్తి. వల్లభాచార్యుడు 'యిప్పుడు నీవు వచ్చి నాకు యేవిధంగా దర్శనం యిస్తున్నావో అట్లానే యిస్తాడు భగవంతుడు. నిజంగా నేను నీదగ్గరకు వస్తే యిప్పుడు కాదు తరువాత చూస్తానని చెప్పి పంపించవచ్చు. లేక దర్బారు హాలులోకి పోయి కూర్చో నేను చూస్తానని చెప్పవచ్చు. ఏదో సాకు చెప్పి నన్ను వెనుకకు పంపవచ్చు. నాకు ఎట్టి శ్రమ లేక నీవే వచ్చి దర్శనమిచ్చావు. అట్లానే భగవంతుడు యేవిధమైన శ్రమలేక భక్తులకు సునాయాసంగా దర్శనమిస్తాడు. భక్తులు సాధనలు చేసి భగవంతుని చూడాలంటే యిప్పుడు కాదు అప్పుడు కాదని భగవంతుడు ఎన్నో సాకులు చెప్పవచ్చును. కాని భగవంతుని అనుగ్రహం కలిగిందంటే తానే నడచుకొని వస్తాడు. ఈ అనుగ్రహము కలగటానికి కారణం మలవిక్షేప ఆవరణములు నిర్మూలము గావించుకోటమే. అహంకారము పోవాలి. మమకారము దూరము పెట్టాలి. రాగద్వేషములకు యేవిధంగా అవకాశము యివ్వకుండా వుండాలి. చిత్తశుద్ధి కలిగి వుండాలి. అప్పుడే భగవంతుడు తనకు తానై నడచి వస్తాడు. దీనికి త్యాగరాజు కూడా చెప్పాడు. తాను మద్రాసు దగ్గర కోయంబత్తూరులో వుండే వాడు శ్రీపెరంబదూరు. ఆయన కూడను కాకర్లవారే. వారి తాతలు తంజావూరు మహారాజు దగ్గర పండితులుగా వుండటం చేత తిరిగి తంజావూరు వెళ్ళిపోయారు. అక్కడను పోయి settle అయిపోయారు. తన బిడ్డను పెండ్లి చేయాలని సంకల్పించుకున్నాడు త్యాగరాజు. అప్పుడు శిష్యులకు వెంకటాద్రి భట్టుకు వీరందరికి letters వ్రాసాడు. సీత పెండ్లి చేస్తున్నాను మీరందరు రావలసిందని. ఆ బిడ్డకు సీత అని పేరు పెట్టారు. ట్రైన్సు బస్సులు లేవు అప్పుడు. మద్రాసునుండి పది పన్నెండు దినములు నడచుకొని పోయాడు. ఆ బిడ్డకు ప్రజెంటేషను యివ్వాలని రాముని ఫోటో తీసుకు పోయారు. వెంకట్రామ భట్టు తీసుకొని పోయి యిచ్చారు త్యాగరాజుకు. చూచాడు. 'నను పాలింపగ నడచి వచ్చితివా రామా' నడచి పోయినారు వీరు. ట్రైన్ లోనో బస్సులోనో పోలేదు. నన్ను పాలించటానికి నడచి వచ్చావా అని భావోద్రేకంతో చక్కగా పాడుకున్నాడు. అట్లానే వల్లభాచార్యుడు భగవంతుడనుగ్రహిస్తే తాను దూరం నడచి వస్తాడని చెప్పాడు అక్బరు చక్రవర్తికి. ఇది యేరీతిగా సాధ్యమవుతుందని అన్నాడు

అక్బరు చక్రవర్తి. భగవదనుగ్రహానికి యే కారణములు లేవు. కారణము వెతకటమే పిచ్చితనము. లోకసంబంధమైన పనులకు కారణాలుంటాయి. కాని భగవదనుగ్రహానికి అకారణమైన ప్రేమ. ఈ జన్మలో చేసిన పుణ్యము తో కాదు జన్మజన్మములలో చేసిన పుణ్యములు కూడను కూడి వస్తుంటాయి. ఈ జన్మలో నేను తగినంత పుణ్యము చేయలేదే నాకెందుకు ఇంత దర్శనం ఇచ్చావు. కాని పూర్వజన్మ ఫలితము చేరి వస్తుంది. చక్రవర్తీ! పిల్లవాడు B.A. ప్యాసైనాడంటే దాని అంతరార్థము ఏమిటి? ప్రాథమిక స్కూలు, ఉన్నత పాఠశాల పూర్తి చేసి వచ్చారని అర్థము. అవిరెండూ పూర్తి కాకుండా BA చేయటానికి లేదు. నీకు యీనాడు అదృష్టము కలిగిందంటే పూర్వము దీనినంతా ప్యాస్ చేసి వచ్చావు. ఈ నాడు పిల్లలు యవ్వనమంటే బాల్యము దాటి వచ్చారు. ఇదొక పండు అని మనం అనుకుంటే ఇది కాయ పక్వమై ఫలముగా వచ్చింది. ఈ నాడు భగవదనుగ్రహము నాకు లభించిందంటే పూర్వము ఇవన్నీ దాటుకొని వచ్చాము. పాతదాన్ని కూడను మనం చేర్చుకోవాలి.

(4) దీనికి ఒక చిన్న ఉదాహరణము. మనము ప్రత్యక్షంగా అప్పటికప్పుడు వున్న విషయాన్ని చూడటానికి ప్రయత్నిస్తాం. ఒక రాయి వుంటున్నాది. పిల్లలలో ఒక పెద్ద పిల్లవాడు వచ్చి సుత్తితో కొట్టాడు ఇరవై దెబ్బలు. అది పగలలేదు. తరువాత old man S.N. Singh లాంటి వాడు వచ్చాడు. ఆయన వచ్చి సుత్తితో రెండు సార్లు కొట్టాడు. రాయి బద్దలైంది. అంత యువకుడు ఇరవై దెబ్బలు కొట్టినా పగలలేదు. ఇంత వృద్ధుడు రెండు దెబ్బలు వేసేటప్పటికి పగిలిపోయిందని గర్వము వచ్చింది. దీని అంతరార్థము యేమిటి? ఈ యన రెండు దెబ్బలకు పూర్వము ఇరవై దెబ్బలు కూడు కోవాలి. పూర్వము ఇరవై దెబ్బలు కొట్టటం చేతనే యీ రెండు దెబ్బలతో విరిగి పోయింది. కాబట్టి ఇరవైరెండు దెబ్బలకు పగిలింది. ఈ నాడు భగవంతుడు ప్రత్యక్షమైనాడంటే పాతవన్నీ కూడుకుంటేనే యీ ఫలితము మనకు అర్థమవుతుంది.

దీనినే వల్లభాచార్యులవారు మూడు రకములైన దృశ్యములుగా నిరూపిస్తూ వచ్చారు. మొదటిది పుష్టి భక్తుడు. రెండవవాడు ప్రవాహ భక్తుడు. మూడవవాడు మర్యాద భక్తుడు. పుష్టి భక్తుడు, ప్రవాహ భక్తుడు, మర్యాద భక్తుడు.

పుష్టి భక్తుడంటే యేమిటి? నిరంతరము దైవ చింతనలోనే వుండేవాడు. ఇది ఎలాంటిదంటే తాను చేసే పని దైవసేవయే. తాను పట్టిన వస్తువులన్నీ దైవస్వరూపమే. తాను తినే అన్నమంతా దైవప్రసాదమే. త్రాగే నీరంతా తీర్థమే. నడచే నడకంతా దైవ ప్రదక్షిణమే. చూచే చూపులన్నీ దైవ దృష్టియే. ఈ రకంగా వుండేవాడు పుష్టి భక్తుడన్నారు. అంతా దైవమయమే.

భగవంతుడు ఎలా వుంటాడంటే కృష్ణా నా యొక్క పలుకులు నీవు వినటం లేదా? నేను ఎంత ఏడుస్తున్నాను. నేను ఎంత మొరపెట్టుకుంటున్నాను. నా మొర నీ చెవులలో పడటం లేదా అంటే అతని

దగ్గర రెండు చెవులు మాత్రం వుంటాయిట. కృష్ణా ఎంతకాలం యిలా కష్టాలు పడాలి. నా కష్టాలు దుఃఖము నీవు చూడటంలేదా అని ప్రార్థిస్తే వానికి రెండు చక్కని చుక్కల్లాగ కన్నులుంటాయిట. భగవంతుని యేవిధంగా ప్రార్థిస్తే యద్భావం తద్భవతి. చూడటం లేదంటే చూపులే వస్తాయి. వినటం లేదా అంటే చెవులే వస్తాయి. రావేరమ్మంటే తానే వస్తాడు. కనుక భగవంతునిలో యేవిధమైన తేడా లేదు. భక్తుని ప్రార్థనే యీ బేధములంతా. భగవంతుడు యే విధంగా ప్రార్థిస్తే ఆవిధంగా వస్తాడు. భగవంతునికి ఒక రూపమే లేదు. ఏ రూపాన్ని మీరు ప్రార్థిస్తే ఆ రూపములో వస్తాడు. అన్నింటిలోను దివ్యత్వమే. మీరు చూస్తూ వుంటారు. ice cream కప్పులలో వేస్తారు. కొన్ని packets లో యిస్తారు. కొన్ని పుల్లలకు పెట్టి యిస్తారు. ఈ రకంగా పలు విధాలుగా అన్నింటిలోను ice cream వుంది. ఏ రకముగా ప్రార్థిస్తే ఆ రకంగా వస్తాడు. దివ్యత్వము ఒక్కటే. పుష్టి భక్తుడనగా నిరంతరము యే పని చేసినా, ఏ చింతన చేసినా, ఏ కోరిక కోరినా, ఏ పనిలో ప్రవేశించినా ఎక్కడికి పోయినా అదే చింత వుంటుంది. కృష్ణా నా వెంట లేవా నన్ను కాపాడరావా అని ప్రార్థించే వాని దగ్గర అడుగుల శబ్దము మాత్రమే వినబడుతుంది. మీరు హృదయపూర్వకంగా ప్రార్థిస్తే తాను మనసు కరిగి వస్తూ వుంటాడు. నీవు రెక్కలు కరిగేలా పని చేస్తే పండ్లు అరిగేలా తినటానికి హక్కువుంటుంది. ఆ విధంగా నీవు చక్కగా ప్రార్థన చేస్తే దైవము తప్పక నీకు ప్రత్యక్షమవుతాడు. ప్రార్థన చేస్తున్నాము. మనస్సులో ఒకటి. వాక్కులో ఒకటి. కాదు కాదు. త్రికరణ శుద్ధి కావాలి. మూడు ఒకటై పోవాలి. ఈ విధంగా వుండేది పుష్టి భక్తి అన్నారు.

ప్రవాహ భక్తి. ఈ ప్రవాహ భక్తి లోపల దేవుడూ వద్దు దైవము వద్దు. నాకు సుఖము కావాలి. ధన కనక వస్తు వాహనాదులు కావాలి. నాకు ఐశ్వర్యము వుండాలి. పదవులు వుండాలి. ప్రాకృతమైన చింతలతో పరితపిస్తూ వుంటాడు. 'పునరపి జననం పునరపి మరణం' ఈ ప్రవాహము లో కొట్టుకొని పోతాడు.

మర్యాద భక్తి. అనగా వేదమునందు బోధించిన రీతిగా, శాస్త్రమునందు చెప్పిన రీతిగా నడచుకోటం. ప్రాకృత సంబంధమైన గౌరవమును కొంతవరకు అనుసరిస్తూ సమాజమునకు విరుద్ధము గాని చర్యలు మనం చేస్తూ మోక్షముపై కర్తవ్యము నిర్వర్తిస్తూ భగవంతుని ధ్యానించటము మర్యాద భక్తి అన్నారు.

అక్బరు చక్రవర్తి అడిగాడు. 'వల్లభా మీరు యీ మూడింటిలో యేదానికి చెందినవారు' ఈ మూడింటికి అతీతమైన వాడిని నేను అన్నాడు. ఇదే పరాభక్తి. పుష్టి భక్తి కాదు. ప్రవాహ భక్తి కాదు. మర్యాద భక్తి కాదు. అన్నింటికి అతీతమైనది. అది నీవు నేను ఒక్కటే అనే భావము. యిదే అద్వైత భావము నీలో నేనున్నాను. నాలో నీవున్నావు. ఈ విధమైన పరాభక్తిని ఏకాంత భక్తి అని కూడను చెబుతూ వచ్చారు.

దేశానికి లోకానికి మానవులకు ప్రేమతత్వాన్ని బోధించాలని వల్లభాచార్యుని ప్రధానలక్ష్యము

సర్వం కృష్ణ మయం. ఆకాశం కృష్ణమయం. పంచ భూతములంతా కృష్ణమయం. దైవత్వమును గుర్తింపజేయటా నికి వల్లభాచార్యుడు తాను చేస్తూ తాను అనుభవిస్తూ ఇతరులకు బోధిస్తూ వచ్చాడు. ఈ విధంగా మధుర భక్తిని బోధిస్తూ వచ్చాడు. భక్తి ఆరు విధములుగా వుంటున్నది. సఖ్యభక్తి, దాస్యభక్తి, అనురాగ భక్తి, వాత్స ల్య భక్తి, మధుర భక్తి. మధురభక్తి అన్నింటికిని కట్టకడపటిది. మధుర భక్తి అనగా దైవమును భర్తగాను తాను దైవమునకు అంకితమైన వ్యక్తిగాను భావించటం. సర్వస్వము నీవే. ఇంతకంటె కోరనక్కర లేదు. నవ విధ భక్తులలో కట్టకడపటిది ఇదే. శ్రవణం, కీర్తనం, విష్ణు స్మరణం, పాదసేవనం, వందనం, అర్చ నం, దాస్యం, స్నేహం ఈ ఎనిమిది గౌణ భక్తులు అన్నారు. గౌణ భక్తి అనగా ప్రాకృత సంబంధమైన భక్తి. ఆత్మ నివేదనం అంటే నిజమైన భక్తి అన్నారు. అర్పితము చేయటమే. చేతిలో వున్న ఒక బొట్టు నీటిని సముద్ర ములో వేస్తే ఈ బొట్టు సముద్రము ఒకే రూపాన్ని ధరిస్తుంది. అదే బొట్టు నీవు పెట్టుకుంటే పదినిము షాలలోపల ఆవిరిగా మారిపోతుంది. నీవు చిన్నదిగా భావిస్తున్నావు. నీవు ఆలాగ చేయవద్దు. దానిని అనంతమైన సముద్ర మనే ప్రేమలో లీనము చెయ్యి. అప్పుడు రెండూ పోయి ఒకటైపోతాయి. కృష్ణపోయి సముద్రములో చేరుతున్నది. యమున పోయి సముద్రములో చేరుతున్నది. గంగపోయి సముద్రము లో చేరుతున్నది. చేరిన తరువాత కృష్ణ, యమున, గంగలను తీసుకు రావటానికి వీలు కాదు. ఏకమై పో తాయి. నీ జీవితము భగవంతునికి అర్పితము చేస్తే రెండూ ఒకటైపోతాయి.

ఇక్కడ, అక్కడ, ఎక్కడ చూచినా ఒక్కడే కృష్ణుడు మనకు వున్నాడు. నాకు ఎక్కడ చూచి నా కృష్ణుని ప్రేమయే. కృష్ణుడు లేని స్థానము లేదు. సర్వము తన యొక్క స్వరూపమే. ఆవిధమైన తత్వమును వల్లభుడు ప్రబోధిస్తూ వచ్చాడు. ఏ సందర్భమునందు, ఎలాంటి పరిస్థితులందు కూడను భేదభావము వల్లభాచార్యు లో రాలేదు. ప్రాకృతమైన కష్టములు సంభవించినప్పుడు కూడను ఇదంతా కృష్ణుని దయే అని ఇతరులకు బోధిస్తూ వచ్చాడు. అందరూ చేరి వల్లభాచార్యుని వివాహమాడమని బోధిస్తూవచ్చారు. వల్లభాచార్యుడు ప్రశ్నించాడు. ఎవరికి వివాహము అన్నాడు. నీకే అన్నారు. నాకైపోయింది అన్నాడు. ఎట్లా అయింది. దైవము నేను రెండూ ఒకటే. అంశము నుండే వచ్చింది. అంశములో చేరిపోయింది. నేను భగవంతుని నుండి వేరనుకున్నప్పుడే వివాహము కావాలి. అ లాంటి సమయములో వివాహమెందుకు. ఈ విధంగా మధుర భక్తిని ప్రబోధిస్తూ వచ్చాడు. శంకరులవారు అద్వైత సిద్ధాంతమును, వల్లభాచార్యులు పూర్ణ మధుర భక్తి సిద్ధాంతమును ప్రబోధించారు. శంకరాచార్యులకంటె, వల్ల రామానుజాచార్యులకంటె, వల్లభాచార్యుని ప్రభావము వైష్ణవులలో అధికమవుతూ వచ్చింది. ఈ వల్లభాచార్యుడు తన పని పూర్తి చేసుకొని తదుపరి ఎక్కడికి వెళ్ళినాడో ఎవరికి తెలియదు. ఇలాంటి ది ఆదర్శనీయమైన మహాను భావుల తత్వాలు.

లోకములో అధర్మము, అవిశ్వాసము, ఆడంబరము, కల్పితము అభివృద్ధి అయినప్పుడు

యిలాంటి అంశములంతా వస్తుంటాయి. వచ్చి జగద్గురువు ప్రబోధలు సల్పుతూ వుంటారు. మానవుని యందు ప్రధానమైనది చిత్తశుద్ధి. చిత్త శుద్ధి కావాలనుకుంటె సమాజసేవ చెయ్యాలి. సమాజసేవతో బాటు దైవ చింతన చేయాలి. భగవంతుడు దూరముగా వున్నాడనుకోకూడదు. దూరముగా వున్నాడనుకుంటె దూరముగానే వుంటాడు. నాకు దగ్గరగా వున్నాడనుకుంటె దగ్గరగానే వుంటాడు. దూరము దగ్గర నీ భావమే గాని భగవంతుడు ఎప్పుడూ ఒకచోటే వుంటాడు. దైవము ఎలాంటివాడు? ఎప్పుడూ మారనటువంటివాడు. ఇక్కడ ఒక త్రాడు వున్నది. కొంచెం చీకటిలో పాము అనుకుంటున్నావు. అది పాము కాదు త్రాడే. నీవు పామనుకున్నప్పుడు త్రాడే అది. లైటు వేసి చూచినప్పుడు త్రాడు అనుకున్నప్పుడు త్రాడే అది. త్రాడు యేమీ మారలేదు. అదే రీతిగా దైవము కూడను జగత్తు అనుకున్నా తాను దైవమే. దైవమనుకున్నా తాను దైవమే. దైవము ఎప్పుడు జగత్తు రూపములోనే వున్నాడు. అదే రీతిగా దైవము కూడను జగత్తనుకున్నా తాను దైవమే. దైవమనుకున్నా తాను దైవమే. దైవము ఎప్పుడు జగత్తు రూపములో వున్నాడు. దీనిలో మార్పు నీ దృష్టి మార్పే. త్రాడు అనుకోటము నీ దృష్టి దోషమే. పాము అనుకోటము నీ దృష్టి దోషమే. ఎప్పుడూ త్రాడు త్రాడుగానే వుంటుంది. దైవము దైవముగానే వుంటాడు. నీ భావము నీవు పరిశుద్ధము గావించుకోవాలి.

విద్యార్థులారా! మీ వయస్సు బట్టి మీ భావములు అనేకరకములుగా పోతూ వుంటాయి. ఇవి వేసుకున్న అద్దాల ప్రభావమే. ఎట్టి రంగు ధరిస్తే అట్టి రంగుగానే కనుపిస్తుంది జగత్తు. ప్రేమరంగు వేసుకుంటె ప్రపంచమంతా ప్రేమ మయంగా వుంటుంది. ద్వేషము రంగు వేసుకుంటె ద్వేషముగానే కనుపిస్తుంది. లడ్డు తింటె తీపిగానే వుంటుంది. కానీ మలేరియా జ్వరం వుండటం చేత లడ్డు చేదుగా వుంటుంది. కాబట్టి లడ్డు దోషం కాదు నీ నాలుక దోషం కాదు. మీ భావములే దోషముగాని భగవంతునిలో ఎట్టి దోషము లేదు. నిర్గుణుడు, నిరంజనుడు, సనాతనుడు, నికేతనుడు, నిత్య-శుద్ధ-బుద్ధ-ముక్త-నిర్మల స్వరూపుడు. మకాన్ని భావాలన్ని మీ ప్రారబ్ధ కర్మలను పురస్కరించుకొనియే వస్తుంటాయి. వాటిని మీరు పరిశుద్ధము గావించటానికి తగిన ప్రయత్నం చేయాలి.

విద్యార్థులారా! ప్రాచీన కాలమునుండి భారత దేశములో యిలాంటి మహనీయులు వుద్భవించే అనేక రకములైన ఆదర్శములను నిరూపించి, అనుభవించి యితరులకు అందించారు. చెప్పినది నడచుకుంటాడు భగవంతుడు. కాని నడచుకోలేదేమి అనుకోవచ్చు. అది మీ పొరపాటు. చూడండి ఆ వంశములోని వారందరు మరచినప్పటికి ఆమెకు గర్భమై కూడను నూరు యాగములై పోయాయని తెలిసి కూడను ఆ పిండమును పారవేసి వచ్చారు. కాని తన మాట తన మాటయే. పిండమును పారవేసినప్పటికి అక్కడ బ్రహ్మాండముగానే రూపొందింది. అదే bodyగా తయారై పోయింది. నూరు యాగములు చేసినప్పటికి తాను వచ్చాడు. వల్లభాచార్యుడు కృష్ణుని స్వరూపమని వైష్ణవుల విశ్వాసము. కృష్ణుడు సకల

హృదయములందు వున్నాడు. సర్వస్వరూపము కృష్ణునిదే. వల్లభాచార్యుడు ఎంతో మైమరచిపోయేవాడు ప్రత్యక్ష అనుభూతులంటూ చాటుతూవచ్చాడు వల్లభాచార్యుడు. వల్లభ ఆచార్యుడు. నావల్లభుడు కృష్ణుడు అతనే ఆచార్యుడు. అతని యొక్క స్వరూపమూ ఇంతని స్వరూపమూ. అదీ యిది రెండూ ఒకటే. ఈ విధంగా ఉపదేశం చేస్తూ కేవలం కృష్ణభక్తి లోపల జగత్తును అనేకరకములుగా మార్చ చేస్తూ వచ్చాడు. అందరూ యితని అంత్య సమయము యేరీతిగా వుంటుందో చూడాలని బంధువులు, మిత్రులు అందరూ కాచుకొని వుంటున్నారు. ఇంటిలో పడుకున్నాడు. తలుపు బయట అందరూ వుంటున్నారు. తెల్లవారి తలుపు తెరచి చూస్తే వల్లభాచార్యుడు లేడు. దేహము అంతర్థానమై పోయింది. నిజంగా భగవత్ తత్వము ఎవరూ అర్థం చేసుకోలేరు. 'తెలియ లేదు రామా భక్తి మార్గము' అని త్యాగరాజు చెప్పాడు. నిజంగా మనస్సు పట్టి దీక్షలోపల భగవంతుని సాధించాలనుకుంటే ఎన్ని దుఃఖములైనా, ఎన్ని కష్టములైనా ఎన్ని నష్టములైనా భరించుకొని సాధిస్తే తప్పక సాధ్యమవుతుంది.

1990 సెప్టెంబరు 23వ తేదీ ఆదివారం, త్రయీబృందావనంలో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం